

అక్షరాస్యత పెంపునకు కృషి

ప్రజాశక్తి - కోటనందూరు



మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటనారాయణ

గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత నిర్మూలించి అక్షరాస్యత శాతం పెంపుదలకు కృషి చేయాలని ఎంపిడిఒ పి.వెంకటనారాయణ సూచించారు. బుధవారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంఇఒ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

టీచర్ ఎంఎల్‌సికి 16,316 మంది ఓటర్లు

- పురుషులు 9,674, స్త్రీలు 6,642
- తుది జాబితాను వెల్లడించిన రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తంగా 16,316 మంది ఓటర్లు నమోదయ్యారు. తుది ఓటర్ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. టీచర్ ఎంఎల్‌సి సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. కలెక్టర్ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాలు, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్, ఎంఇఒ, పోలింగ్ స్టేషన్లలో బుధవారం నుంచి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉమ్మడి తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలో 113 మండలాల్లో మొత్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 9,674 మంది, స్త్రీలు 6,642 మంది ఉన్నారని తెలిపారు. 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 614 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో 19 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,893 మంది ఓటర్లు, ఏలూరు జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,605 మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు 3,333 మంది ఓటర్లు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు, 3,209 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 3,662 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

11 నుంచి నామినేషన్లు స్వీకరణ

టీచర్స్ ఎంఎల్‌సికి సంబంధించి ఈనెల 11 నుంచి 18 వరకు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

ఈ ఎన్నికకు సంబంధించి కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాలు డిఆర్‌ఒలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

23 వరకు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 23 వరకూ పెంచారన్నారు. ఈనెల 6తో గడువు ముగిసిందని, దీనికి సంబంధించి 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వస్తుందన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 23 వరకూ ఓటర్లుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 నవంబర్ 1కి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 15 సంవత్సరాల క్రితం స్టడీ కంప్లీట్ చేసి ఉండాలని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇప్పటివరకు 1,74,772 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. దీనికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలు, ఏలూరు జిల్లాలో 45 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కాకినాడ డిఆర్ఒ జె.వెంకట్రావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎమ్.గంగా సూరిబాబు మాట్లాడారు. అధికారంలోకి రాకముందు కూటమి పార్టీలు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక విద్యా రంగాన్ని కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మూడేళ్లుగా చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేటికీ విడుదల చేయాలేదన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టమైన హామీని కళాశాల యాజమాన్యాలకు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేలా విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిగ్రీ కళాశాలలో మేజర్-మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, మేజర్ మైనర్ విధానం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకి సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే హాస్టల్‌కు పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు తెలంగాణ మాదిరిగా మెస్ ఛార్జీలను రూ.3000 పెంచాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. జీవో నెం.77 రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రియంబర్స్‌మెంట్ వర్తింపచేయాలని, తల్లికి వందనం ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, చిన్ని, లోవరాజు, సిద్దు, వెంకటేశ్, గోపాలకృష్ణ, జై రాము, సాహిత్, దత్తు, రాజు, హేమ, సాయి రజ్, స్వామి, వేంకట్ పాల్గొన్నారు.

8 నుంచి సిపిఎం 'ప్రజాపోరు'

ప్రజాశక్తి - కాకినాడ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఈ నెల 8వ తేదీ నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రజాపోరు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ పాలకులు దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కూటమి పార్టీలు అనేక హామీలు ఇచ్చాయని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నదని అన్నారు. మద్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నామని గొప్పగా చెబుతున్న పాలకులు చేతనైతే బియ్యం, ఇతర నిత్యవసరాలు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో యువత ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్, డిఎస్‌సి, పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో ఈ నెల 8వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని, సమస్యలు తెలుసుకుని, కరపత్రాలు పంచుతూ క్యాంపెయిన్ నిర్వహిస్తామని, 15వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఈ ధర్నాలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలక వెంకటరమణ, సిహెచ్.రమణి పాల్గొన్నారు.

ప్రగతి కళాశాలలో మూడు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి



ముగింపు సందర్భంగా విద్యార్థులతో శిక్షకులు

మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల వర్క్‌షాపు నిర్వహించారు. హైదరబాద్‌కు చెందిన బ్రెయినో విజన్ సహకారంతో 'బిల్డింగ్ డేటా డ్రివెన్ వెబ్‌సైట్ విత్ హెచ్‌టిఎంఎల్, సిఎస్‌ఎస్, మరియు వర్డ్ ప్రెస్' అనే అంశంపై వర్క్ షాప్, హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రెయినో విజన్ ట్రైనర్ ఎం.నారాయణ స్వామి పాల్గొని వెబ్ అప్లికేషన్స్‌లో ఉండే వివిధ ప్రక్రియలను, ప్రాజెక్ట్స్ చేయుటకు అనుసరించవలసిన ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవి. రాజేష్, కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవి.హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, కె.సత్యనారాయణ, జి.నరేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐలాజ్ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఈ నెల 8వ తేదీన అన్నవరంలో జరిగే ఆలిండియా లాయర్స్ అసోషియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్)మహా సభలను విజయవంతం చేయాలని ఐలాజ్ కన్వీనర్ బుగత శివ కోరారు. బుధవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై దేశ వ్యాప్తంగా ఐలాజ్ పోరాటాలు చేస్తుందన్నారు. న్యాయవాదులపై దాడులకు వ్యతిరేకంగా ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని, 60 సంవత్సరాల పైబడిన న్యాయవాదులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలాజ్ కమిటీ సభ్యులు అవసరాల దేవి, కార్యదర్శి మధుబాబు, న్యాయవాదులు ఆడారి సుగుణ పాల్గొన్నారు.




క్లాప్ డ్రైవర్లకు మద్దతు ఇస్తున్న చంద్రమళ్ల పద్మ

13వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

బకాయి జీతాలు చెల్లించాలని క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 13వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్ల ప్రతినిధులను కమిషనర్ భావన తన కార్యాలయానికి పిలిచి మాట్లాడారు. క్లాప్ వాహన డ్రైవర్ల జీతాల కోసం సిడిఎంఎకి మున్సిపాలిటీ నుంచి రూ.30 లక్షలను పంపించినట్లు తెలిపారు. త్వరలోనే సంబంధిత కాంట్రాక్టర్ జీతాలను వేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకట రమణ కమిషనర్‌గా జరిగిన చర్చల్లో సారాంశాన్ని ఆందోళనా శిబిరం వద్ద క్లాప్ డ్రైవర్లను వివరించారు. తమ బ్యాంకు ఖాతాల్లో జీతాలు పడిన తరువాతే విధులకు హజరౌతామని, అప్పటి వరకూ ఆందోళనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్లాప్ డ్రైవర్ల ఉద్యమానికి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, శివశంకర్, అరుణ్‌కుమార్, కొండబాబు, భద్ర, భైరవస్వామి, దుర్గాప్రసాద్, చంద్రపాల్, సాగర్, శివ, మహేష్, లావరాజు, దుర్గ బాబు, రాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సామాజికవేత్త దూసర్లపూడి దీక్ష విరమణ

-విలీన గ్రామాలతోనే ఎన్నికల నిర్వాహణ
-ప్రభుత్వ ఉత్తర్వులను అందజేసిన కలెక్టర్



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విలీన గ్రామాలతో కలిపి నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో గత 3 రోజులుగా నిరవధిక నిరహార దీక్ష చేస్తున్న పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు దీక్ష విరమించారు. బుధవారం దీక్షా శిబిరాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి సందర్శించి ఆయనను పరామర్శించారు. విలీన గ్రామాలను నగర పాలక సంస్థలో విలీనం చేసి ఎన్నికలను సకాలంలో నిర్వహించి, 2025-26 ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామాలకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సంబధిత 2 పేజీల ఉత్తర్వులను రమణరాజుకు కలెక్టర్ అందించారు. అనంతరం రమణ రాజుకు నిమ్మరసం అందించి నిరాహార దీక్షను విరమింప చేశారు. విలీన గ్రామాల పరిస్థితిని సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లేందుకు విలీన గ్రామాల సాధన సమితి ప్రతినిధి బృందానికి ప్రభుత్వపరంగా అపాయింట్‌మెంట్ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్లగా తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట పంచాయతీలతోపాటు, స్వామి నగరం, టీచర్స్ కాలనీ డివిజన్లపై కోర్టు వ్యాజ్యాల ఉండటంతో ఎన్నికలు నోచు కోలేదని అన్నారు. 2016లో గవర్నర్ ఆర్డినెన్సు ద్వారా నగర పాలక సంస్థలో విలీనం అయినా 2017లో దస్త్రాల ప్రక్రియ పూర్తి కాకపోవడం, అదే సమయంలో ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో 48 డివిజన్లకే పరిమితమై ఎన్నికలు జరిగాయని తెలిపారు. గత రెండేళ్లుగా కార్పొరేషన్ ఎన్నికలకు ఆటంకం ఏర్పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇటువంటి విలీనం సమస్యలు ఉన్నాయని, వీటిపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు చేపట్టే ఆలోచన ప్రభుత్వానికి ఉందని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించిన అంశాలను ఆయన ఉదహరించారు. రాబోయే ఏడాది ఆర్థిక సంఘం నిధులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దన్నారు. రమణరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన నిరవధిక నిరహారదీక్షపై అధికారులు స్పందించి సానుకూలంగా నిర్ణయం తీసుకున్నందుకు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, తొట్టెంపూడి రాజా, తటవర్తి సుబ్బారావు, జోగా అప్పారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ విఒఎల ర్యాలీ

ప్రజాశక్తి - కరప



సమైఐక్య భవనం వద్ద నినాదాలు చేస్తున్న విఒఎలు

తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ విఒఎలు ర్యాలీ నిర్వహించారు. బుధవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయం వద్ద నుంచి సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు ర్యాలీ నిర్వహించి ఎపిఎం బాలాదేవికి వినతిపత్రం అందజేశారు. మండల విఒఎల అధ్యక్షురాలు ఎస్.పద్మ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. పోరాటాలు ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకుంటామని అన్నారు. ఇటీవల కాలంలో రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు పెరిగాయన్నారు. వీటికి నిరసనగా అక్టోబర్ 30న ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందించామని గుర్తు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకూ వివిధ ఉరూపాల్లో తమ ఆందోళనను కొనసాగిస్తామని అన్నారు.

7, 8 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కొండపల్లి 11 కెవి ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ పనుల కారణంగా ఈ నెల 7, 8 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఆనూరు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొండపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయపడుతుందన్నారు. దీనిని ఆ గ్రామ విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

9న కాకినాడ చాప్టర్ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పీపుల్స్ వరల్డ్ కమిషన్ ఆన్ డ్రాఫ్ట్ అండ్ ఫ్లడ్ కాకినాడ జిల్లా చాప్టర్ ప్రతినిధుల సమావేశం ఈ నెల 9న రూరల్ మండలం రాయుడుపాలెంలోని కిరణ్ కంటి ఆసుపత్రిలో జరుగుతుందని సంస్థ ప్రతినిధి దూసర్లపూడి రమణరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం 10.30కు ప్రారంభం అయ్యే ఈ సమావేశం సంస్థ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ ప్రెసింగి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. సంస్థ ముఖ్య సలహాదారులు, పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాకినాడ - సామర్లకోట కెనాల్స్ ప్రక్షాళన, పోర్టు పరిధి వరకూ మొక్కలు నాటించడం వంటి అంశాలపై చర్చిస్తారని తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



మాట్లాడుతున్న న్యాయవాది పట్నాయక్

వివిధ కోర్టుల్లో కేసులపై తక్షణ పరిష్కారానికి లోక్ అదాలత్‌లు దోహదం చేస్తున్నాయని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ అన్నారు. రమణయ్య పేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, తదితర కేసులు లోక్ అదాలత్‌లలో పరిష్కారం చేసుకోవచ్చున్నారు. డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అథాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో రత్న ప్రసాద్, శిరీష, ప్రసాద్ నాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

మస్తర్లలో అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - గండేపల్లి



ఫిర్యాదుదారులను విచారిస్తున్న అధికారులు

మండలంలోని ఉప్పలపాడులో ఉపాధి హామీ పథకంలో కూలీల మస్తర్లలో జరిగిన అవినీతిపై వచ్చిన ఆరోపణలపై ఎపిడి భానుప్రకాష్ బుధవారం విచారణ చేపట్టారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిని విచారణకు పిలిచి ఒక్కొక్కరిగా మాట్లాడారు. వారి వారి అభిప్రాయాలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. ఈ విచారణలో ఎపిఒ గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి తరంగిణి, ఇసి రమేష్, గ్రామ పెద్దలు మేడిబోయిన శ్రీను, రమణ పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీల ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో బుధవారం రెండు మత్స్య సహకార సంఘాలకు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించినట్లు మండల మత్స్య శాఖ ఇన్‌ఛార్జ్ పద్మ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ మండలంలోని వాలు తిమ్మాపురం గ్రామంలోని బి - 59 మత్స్య సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షులుగా కాదా సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా బల్ల పెద్దరాజు, కార్యదర్శిగా పెంకి అప్పారావు ఎంపికయ్యారన్నారు. కట్టమూరు గ్రామంలోని బి- 39 మత్స్యకార సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా వేలంగి నానిబాబు, ఉపాధ్యక్షులుగా వరదాసు చెల్లారావు, కార్యదర్శిగా బూసి సూర్యచంద్ర ఎంపికయ్యారన్నారు. ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు.

పేపర్ ప్లేట్ యూనిట్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - సామర్లకోట



యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

స్థానిక సిరి మానసిక వికలాంగ పాఠశాలలో పేపర్ యూనిట్‌ను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. పట్టణ రైతు సంఘ అధ్యక్షులు, భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ కుటుంబం ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్నది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు అని, ఈ యూనిట్ యంత్రం వలన వారికి ఏ హానీ కలగకుండా జాగ్రత్తలు వహించాలని సూచిం చారు. నిర్వాహకురాలు గోపీదేవి మాట్లాడుతూ యంత్రం పనితీరుపై అవగాహన ఉన్న పిల్లలతో తమ పాఠశాల సిబ్బంది పర్యవేక్షణలో తయారు చేయనున్నట్లు చెప్పారు. కేవలం ఉపాధి అవకా శలపై విద్యార్థులకు అవగాహనా కల్పించేందుకే ఈ యూనిట్‌ను నడుపుతున్నట్లు చెప్పారు. ఒకపక్క విద్యార్థులకు శిక్షణ ఇస్తూ, మరోపక్క ఉత్పత్తి అయిన పేపర్ ప్లేట్స్‌ను హోల్‌సేల్ మార్కెట్లో అమ్మకం చేస్తామని తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని సిరి మానసిక వికలాంగు కేంద్రంలో విద్యార్థులకు వినియోగిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, కూటమి నాయకులు ఎ.కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్ కుమార్, సరోజ వాసు, పిట్టా జానకి రామరావు పాల్గొన్నారు.



పాలంబడిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి జ్యోతి

పంటల బీమా పథకంతో మేలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకం రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి తెలిపారు. మండలంలోని ఎర్రవరంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు పిఎం కిసాన్ పథకం కింద రూ.6 వేల ఆర్థిక సాయాన్ని కేంద్రం అందిస్తుందని తెలిపారు. దీంతోపాటు పిఎమ్ జెజెబివై బీమా యోజన పథకంలో 50 ఏళ్ల లోపు రైతులు రూ.436, 70 ఏళ్ల లోపు రైతులు రూ.20 ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యానికి అర్హులని వివరించారు. వరి పంట ఎకరాకు రూ.630 ప్రీమియంను డిసెంబర్ 31లోగా చెల్లించాలన్నారు. మినుము, పెసర ఇతర అపరాల పంటలకు రూ.300 ప్రీమియాన్ని డిసెంబర్ 15లోగా చెల్లించడం ద్వారా పంటకు పూర్తిస్థాయి భరోసా లభిస్తుందని తెలిపారు. రిజిస్ట్రేషన్, బీమా ప్రీమియం చెల్లింపులకు గ్రామాల్లోని మీసేవ, ఆధార్ సెంటర్లను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - కాజులూరు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సత్యం

బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని శలపాక గ్రామంలో ఇటీవల జరిగిన నర మేదంలో ప్రాణాలు కోల్పోయిన బత్తుల రాజు, బత్తుల చిన్నయ్య, బత్తుల రమేష్ కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఇటువంటి ఘటన మన ప్రాంతంలో జరగడం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావలసిన సాయాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోతు గనిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాజులూరు మండలం శలపాక గ్రామంలో గత నెల 31న జరిగిన ముగ్గురి హత్యకు కారకులైన ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి రఘువీర్‌విష్ణు తెలిపారు. స్థానిక సర్పవరం సర్కిల్ పోలీస్‌స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎదురుఎదురు ఇళ్లలో నివాసం ఉంటున్న బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబాల మధ్య మనస్పర్థలు కారణంగా ఈ సంఘటన చోటుచేసుకుందని అన్నారు. దీపావళి రోజున ఒక పథకం ప్రకారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో పొట్లకాయల నాగేశ్వరరావు, అతని భార్య బేబి, వారి కుమారులు సుబ్రమణ్యం, దొరబాబు, వినోదు ఇనుప రాడ్లు, మంచం పట్టి కర్రలతో బత్తుల చిన్నయ్య, అతని కుమారుడు బత్తుల రమేష్, తమ్ముడు బత్తుల రాజుపై విచక్షణ రహితంగా దాడిచేసి అతి కిరాతంగా హత్య చేశారని చెప్పారు. వారిని అడ్డుకోబోయిన బత్తుల శ్రీనుపైనా దాడి చేసి గాయపర్చారని తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. శలపాకల గ్రామంలో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కాజులూరు ఎస్ఐ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్ షాప్‌లో చోరీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్ సమీపంలో ఉన్న పాన్ షాప్‌లో గుర్తుతెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి చోరీ చేసినట్లు షాపు యజమాని బండి శ్రీను బుధవారం తెలిపారు మంగళవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి వెళ్లి బుధవారం వ్యక్తిగత పనులపై యానం వెళ్లి సాయంత్రం దుకాణం తెరవగా పైకప్పుకు రంధ్రం పడి ఉందన్నారు. పై కప్పుకు రంధ్రం పెట్టి లోపలకు దిగి సుమారు రూ.20 వేలు విలువ చేసే సరుకులు దోచుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పుష్కర కాలువ గట్టు నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ని మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ని తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ ఆదేశాలతో గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాటు సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

శంఖవరం మండలం రాజవరం గ్రామ పరిసరాల్లో ఉన్న నాటు సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ పి.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై నిఘా పెట్టామని అన్నారు. ఎవరైనా నాటు సారా తయారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లంకురు శివారు పోర పొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(20) అక్కడికక్కడే మరణించాడు. అమలాపురం రొయ్యలు కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువుతో కలిపి ఇంటికి వెళుతుండగా చెయ్యేరు హైస్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలంలో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. సంఘటన జరిగిన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ఏరియా హాస్పిటల్ కి తరలించారు.

బకాయి జీతాలను విడుదల చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ, జగ్గంపేట

తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు, మూడు నెలల బకాయి జీతాలను తక్షణమే విడుదల చేయాలని 104 ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ నాయకులు డిఎంహెచ్ఒ, 104 నోడల్ అధికారి నాగేశ్వర నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీకాంత్, ఎం. త్రిమూర్తులు మాట్లాడారు. 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి 104 వైద్య సేవలను పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ద్వారా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమకి 3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వలన కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజా ధనాన్ని వృధా కాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్‌ను తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, డిఎస్‌సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు ఉద్యోగుల జాబితాలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ వెంకట్రావు, కోశాధికారి శ్రీను, డివిజన్ లీడర్లు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేటలో తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు మండలంలోని రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు పి.దుర్గప్రసాద్, ఎస్.దుర్గప్రసాద్ పాల్గొన్నారు.


నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న 104 యూనియన్ నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యంత్రాంగం

కోటనందూరు మండలంలోని బొద్దవరం జడ్‌పి హైస్కూల్‌లో మహిళల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సదస్సులో ఎస్ఐ టి.రామకృష్ణ మాట్లాడుతూ మహిళల భద్రత కొరకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను, చట్టాలను రూపొందించడం జరిగిందన్నారు. విద్యార్థినులు, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యార్థి దశలోనే మత్తుకు యువత బానిసలు అయిపోతున్నారని, ప్రేమ పేరుతో ఆకతాయిలు వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, మొబైల్స్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పాఠశాల స్థాయి నుంచి బాలికలు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవడం అవసరమని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. బుధవారం స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా తమ నివాస ప్రాంతాలలో మహిళలకు విద్యార్థినులు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలకు వచ్చే వరకూ పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే వరకూ మధ్యలో ఆకతాయిలు ఎటువంటి ఇబ్బందులు పెట్టినా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. **జగ్గంపేట** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ పాల్గొని మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలలో నమోదు అయిన మహిళలకు, యుక్త వయసు బాలికలకు మీటింగ్ లు ఏర్పాటు చేసి వారందరికీ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు రక్షణ గా మహిళా రక్షక్ మొబైల్ నెంబర్ అందరి వద్ద ఉండాలని కోరారు. మహిళలు, విద్యార్థులు ఆపదలో ఉంటే సెల్ నెంబర్ 9494933233కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజ్లు సునీత, అమ్మాజీ బూసమ్మ, కరిమున్నీషా, నాగపర్వతి, పాల్గొన్నారు.


జగ్గంపేటలో మాట్లాడుతున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్


కోటనందూరులో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

కూటమి వల్లే చంద్రబాబుకు విజయం

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి వల్లే చంద్రబాబు గత ఎన్నికల్లో విజయం సాధించగల్గారని వైసిపి జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక రెడ్డి రాజా కళ్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వంగా గీత అధ్యక్షతన నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం కార్యకర్తల్లో మనోధైర్యం నింపుతుందన్నారు. పార్టీ ఓటమికి కారణాలు ఏమైనప్పటికీ ప్రజలకు సంక్షేమ అందించడంలో ఎప్పుడు జగన్ వెనకడుగు వేయలేదన్నారు. జగన్ పరిపాలనలో దేశం మొత్తం రాష్ట్రం వైపు తిరిగి చూసిందని అన్నారు. అయినా గత ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వచ్చాయన్నారు. నియోజకవర్గంలో పవన్ గెలుపునకు అనేక అంశాలు కలిసి వచ్చాయన్నారు. విశాఖలో రిషికొండను మాత్రమే చంద్రబాబు నాయుడు పరిశీలిస్తున్నారని, శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం బాధితుల కోసం ఏర్పాటుచేసిన రీసెర్చ్ సెంటర్‌ని పరిశీలిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో ముక్కుపచ్చలారని చిన్నారులు, మహిళలపై ఆకృత్యాలు పెరిగిపోయాయని అన్నారు. టెక్నికల్‌గా తమకు ప్రతిపక్ష హోద లేకపోయినా రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం తామేనన్నారు. ఓట్లు సీట్లు లేకపోయినా దమ్ము, ధైర్యం ఉన్న పార్టీ తమదన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో శాంతిభద్రతలను అధ్వానంగా ఉన్నాయని అనడం విడ్డూరమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడుతామని, కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. అనంతరం ఇటీవల పట్టణంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కురసాల కన్నబాబు


గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి బుధవారం వైద్య సేవలు, పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందంఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పెద్దాపురం పట్టణానికి చెందిన కాలెపు విజయకుమార్, మంగాదేవి తమ కుమారుడు శౌర్యాన్స్ మొదటి పుట్టినరోజు సందర్భంగా ఈ అన్నదానానికి సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ దివాకర్, శేఖర్, సత్య ప్రశాంత్, లక్ష్మి పాల్గొన్నారు.

యానాం వార్తలు


అధికారుల నుంచి వివరాలను సేకరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

పిడబ్ల్యూడి అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ(పిడబ్ల్యూడి) అధికారులతో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం పలు సమస్యలపై సమీక్షించారు. పెండింగ్లో ఉన్న పనులపై అధికారులను ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిఎస్ఆర్, ఎంఎల్ఎ నిధులు, ఎడి వెల్ఫేర్ ద్వారా జరగాల్సిన పనులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయని ప్రశ్నించారు. పుదుచ్చేరిలో ఉన్న సంబంధిత సెక్రటరీ, డైరెక్టర్లతో సిఎస్ఆర్ నిధులు మొదటి పేస్, ఎన్ఐటిలో ఉన్న 9 పనులకు సంబంధించి ఫోన్లో మాట్లాడారు. వన్ స్టాప్ సెంటర్, కనకాలపేట ఇండోర్ స్టేడియంలో పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసి తక్షణమే ప్రారంభించాలన్నారు. అరటికాయలంక నుంచి జండా స్థంభం వరకూ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఫైనాన్స్ సమస్యలు ఉంటే తనకు తెలపాలని, పుదుచ్చేరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్ఎఒ, ఇఇలకు సూచించారు. ప్రధాన రహదారుల్లో గ్యాస్ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మున్సిపల్ శాఖలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రజా పనుల శాఖ ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇ జ్యోతిరాజు, భాస్కర్, పురపాలక శాఖ జెఇ కుమార్, ఆదిబాబు, వేణు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి

ప్రజాశక్తి - యానాం

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రత్నప్రభ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

8న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 8వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ తాళ్లరేవు సబ్ స్టేషన్ మెయింటనెన్స్ పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కాకినాడ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, పి.మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ, భైరవపాలెంతో పాటు, పోలేకుర్రు పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు, కోరంగి పంచాయతీ కోరంగి, సీతారామపురం, పెద బొడ్డు, చిన బొడ్డు వెంకటయ్యపాలెం, గాడిమొగ పంచాయతీలోని చిన వలసల, పెద వలసల, లక్ష్మీపతిపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

వణ్యప్రాణుల కోసం అడవిలో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ కె.వీరభద్రరావు హెచ్చరించారు. మండలం పరిధిలో విద్యుత్ లైన్ల నుంచి ఎవరైనా జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అటువంటి చర్యలకు దిగినట్లు తెలిస్తే సంబంధిత విద్యుత్ శాఖ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

సహజ వనరుల పెంపుదలకు చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని సహజ వనరులు పెంపుదల చేసే పలు కార్యక్రమాలు నిర్వహించు కోవచ్చునని ఎపిడి వసంత మాధవి తెలిపారు. తాళ్లరేవు గ్రామపంచాయతీలో 2024, 25 ఆర్థిక సంవత్సరంలో పనులు గుర్తించి ప్రణాళిక తయారు చేసే గ్రామసభలో ఆమె మాట్లాడారు. సహజ వనరులు పెంపుదల, వ్యక్తిగత ఆస్తుల పరిరక్షణ, జీవనస్థితిగతులు మెరుగుపర చుకోవడం, గ్రామానికి ఆస్తులు సమకూర్చుకునే పనులు చేసుకోవచ్చునని అన్నారు. అక్టోబర్, నవంబర్ నెలలో గ్రామసభల ద్వారా తీర్మానించిన పనులు ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభించవచ్చునని తెలిపారు. చెరువులు ఆరగట్టే పని ద్వారా కూలీలకు ఎక్కువ పని దొరుకుతుందని అన్నారు. వేతనదారుడు ఎక్కువ రోజులు పని చేస్తే దాని ద్వారా పని దినాలను బట్టి 40 శాతం ఆయా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నున్న శంకర్ నారాయణ, మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సూరిబాబు, చిట్టూరి చలపతి, సచివాలయ కార్యదర్శి వేణుగోపాల్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి వసంత మాధవి

ముగిసిన భాష్యం ప్రీమియర్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి - పిఠాపురం

గత రెండు రోజులుగా పిఠాపురం భాష్యం పాఠశాల ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బిహెచ్ఆర్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ వేడుక బుధవారం ఘనంగా ముగిసింది. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి పది భాష్యం బ్రాంచ్‌ల నుంచి పాల్గొన్న ఈ క్రికెట్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో కాకినాడ శశికాంత్ నగర్ బ్రాంచ్ ప్రథమ స్థానంలో నిలిచారు. రామచంద్రపురం బ్రాంచ్ రన్నర్స్ గా జూనియర్స్ విభాగంలో జగ్గంపేట బ్రాంచ్ విన్నర్‌గా తుని బ్రాంచ్ రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా భాష్యం జోనల్ ఇన్‌ఛార్జ్ వి.గోవిందరాజు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి క్రికెట్‌ను కూడా భాష్యం క్రీడా విభాగంలో చేర్చామని అన్నారు. జోన్‌లో గెలుపొందిన టీం జనవరి మాసంలో గుంటూరు వేదికగా భాష్యం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు మెమొంటో అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ వేణు మాట్లాడుతూ క్రికెట్ పోటీలకు నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యనారాయణ, భాస్కర్, శ్రీనివాస గుప్తా, దివాకర్, సూర్యారావు, అనురాధ పాల్గొన్నారు.


ట్రోఫీలు అందుకున్న విద్యార్థులతో జోనల్ ఇన్‌ఛార్జ్

సిహెచ్‌సిని సందర్శించిన తుమ్మలపల్లి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ బుధవారం సందర్శించారు. మంగళవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య సేవలందించేందుకు వైద్యులు లేకపోవడంపై ఆరా తీశారు. ఇందుకు గల కారణాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ని అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి వివరాలను అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న పలు సమస్యలను వైద్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో పిల్లల వైద్యులు, జనరల్ సర్జన్ తోపాటు, ఎన్‌హెచ్‌ఎంలు ముగ్గురు అవసరం ఉందని వివరించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, వైద్యులు, సిబ్బంది కొరతను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరపురెడ్డి నరేష్, రాజనాల శ్రీను, దొడ్డా శ్రీను, మాదారపు వీరబాబు, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం


రెవెన్యూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిదిద్దేందుకు నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ కార్యాలయం కార్యనిర్వహణాధికారి కాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని తాటిపర్తిలో జరిగిన రీ సర్వే గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గతంలో నిర్వహించిన రిసర్వేలో సర్వే నెంబర్లు, విస్తీర్ణం, పేర్లు తప్పులు ఉంటే ఈ గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సామేరు, గ్రామ సర్వేయర్ తేజ, గోపు చంద్రశేఖర్, కొమ్మిరెడ్డి బుజ్జి, శ్రీను, నాగ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న కాంతారావు

గోదావరి ఒడ్డున ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆత్రేయ గోదావరి నదీపాయ ఒడ్డున ఉన్న ఆక్రమణలను పంచాయతీ అధికారులు తొలగించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ ఆధ్వర్యంలో సుబ్బారాయుడు దిమ్మ, వై జంక్షన్ ప్రాంతంలో ఆత్రేయ పాయను ఆనుకుని నిర్మించిన షెడ్డును తొలగించారు. ఆ ప్రాంతంలో పలు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎవరు ఆక్రమణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి రమణ తెలిపారు.


ఖాళీ చేసిన ప్రాంతంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలో చిన్న బ్రహ్మదేవం గ్రామంలో నిర్మిస్తున్న ఆర్‌బికె బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అలివేలు మంగ పద్మావతి వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపం నిర్మాణ పనులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు బయోటెక్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రామంలో నెలకున్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓట్ల నమోదుకు వెల్లువెత్తిన దరఖాస్తులు

ప్రజాశక్తి- తాళ్లరేవు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటు నమోదుకు సంబంధించి చివరి రోజు కావడంతో బుధవారం దరఖాస్తులు వెల్లివెత్తాయి. మంగళవారం నాటికి ఆఫ్ లైన్‌లో 557, ఆన్ లైన్‌లో 996 దరఖాస్తులు రాగా బుధవారం ఒక్కరోజే ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో 564 దరఖాస్తులు వచ్చాయి. సాయంత్రానికి 2,117 దరఖాస్తుల వచ్చాయని తహశీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. మండలానికి 2,100 దరఖాస్తులు లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. అయితే లక్ష్యాన్ని మించి దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బందిని తహశీల్దార్ అభినందించారు. తాళ్లరేవు కూటమి నాయకులు అత్తిలి బాబురావు, వాసంశెట్టి శ్రీనివాస్, బండారు దొరబాబు, ఆధ్వర్యంలో తహసిల్దార్ త్రినాథరావుకు అత్యధిక దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి సత్తిరాజు, పితాని హేమలత, కుడిపూడి మల్లేష్, వడ్డి విజయ్‌కుమార్, కాండ్రేగుల శ్రీనివాస్, మందపల్లి రమేష్, కొత్తర ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


అధికారికి దరఖాస్తులను అందిస్తున్న టిడిపి నాయకులు

వరకట్నం వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - నల్లజర్ల

తన భర్త వరకట్నం కోసం చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని భార్య నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపల్లి గ్రామానికి చెందిన కపిల బాలనాగ వీర వెంకటలక్ష్మికి 2003లో కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌తో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం అయినప్పటి నుండి ఆమె తీసుకొచ్చిన కట్నం సరిపోలేదంటూ భర్త పలుమార్లు ఆమెను పుట్టింటికి పంపించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మే నెలలో ఆమెను భర్త పుట్టింటికి పంపించగా గ్రామ పెద్దలు పరిష్కరించి ఆమెను భర్త వద్దకు పంపించారు. అయినప్పటికీ భర్త ప్రవీణ్ కుమార్‌లో ఎలాంటి మార్పు రానందున మరల చిత్రహింసలకు గురి చేయడంతో ఆమె నల్లజర్ల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో భర్త ప్రవీణ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

శ్మశాన వాటికలో వాటర్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం గ్రామ శివారున ఉన్న శ్మశాన వాటికలో నిర్మించిన వాటర్ ట్యాంకును సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి ప్రారంభించారు. స్మశాన వాటిక వద్ద నీటి సౌలభ్యం లేకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామానికి చెందిన కాకి సీతారామస్వామి తన సొంత నిధులతో వాటర్ ట్యాంకును నిర్మించారు. ఈ ట్యాంకును బుధవారం గ్రామస్తుల సమక్షంలో సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటర్ ట్యాంకును నిర్మించిన సీతారామస్వామి అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడి రాజు, పైల నాయుడు, కోటిపల్లి నాగు పాల్గొన్నారు.